సాక్షి
సంగారెడ్డి
శుక్రవారం : 29 : ఆగస్టు : 2025

పొట్టిపల్లి-అల్గోల్ గ్రామాల మధ్య వంతెనపైనుంచి ప్రవహిస్తోన్న వరద



ముంచెత్తిన వర్షాలు

భారీ వర్షాలు జిల్లాను మరోసారి ముంచెత్తాయి. వర్షాల ప్రభావంతో జనజీవనం స్తంభించిపోయింది. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. కొన్నిచోట్ల రోడ్ల మీద వరద ప్రవహించి రాకపోకలు స్తంభించిపోయాయి. జిల్లాలోని నల్లవాగు ప్రాజెక్టుపై నుంచి నీళ్లు ప్రవహించాయి. ఇక నారింజ ప్రాజెక్టులోకి 7,444 క్యూసెక్కుల వరద చేరింది. వట్‌పల్లి మండలంలోని ఖాదర్ చెరువు 39 ఏళ్ల తర్వాత అలుగుపారింది. మునిపల్లి మండలంలోని తాటిపల్లి దబ్బవాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. మంజీరా పరవళ్లు తొక్కుతోంది. జహీరాబాద్, మునిపల్లి, ఖేడ్ ప్రాంతాల్లో పంటలు నీటమునిగి రైతులకు అపార నష్టాన్ని కలగజేశాయి. పలుచోట్ల ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. జిల్లాలో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు ప్రకృతి విపత్తుల సహాయక చర్యల బృందాలు (ఎస్ అండ్ ఎస్ డీఆర్ఎఫ్) రంగంలోకి దిగాయి. ఎక్కడిక్కడ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పర్యటించి సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు.

స్తంభించిన జనజీవనం

- నిలిచిన రాకపోకలు
- చెరువుల్లా పంటపొలాలు
- మత్తడి దూకుతున్న చెరువులు,వాగులు,వంకలు

సంగారెడ్డి జోన్/సంగారెడ్డి టౌన్/న్యాల్‌కల్(జహీరాబాద్)/జహీరాబాద్/జహీరాబాద్ టౌన్/హత్నూర(సంగారెడ్డి)/వట్‌పల్లి(అందోల్)/మునిపల్లి(అందోల్)/కంగ్టి(నారాయణఖేడ్)/కల్హేర్(నారాయణఖేడ్)/నారాయణఖేడ్/జిన్నారం (పటాన్‌చెరు): రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు జిల్లా చిగురుటాకులా వణికిపోయింది. పలు కాలనీలు జలమయమయ్యాయి. జహీరాబాద్‌లోని ఇంద్రప్రస్థ, మిర్చి, వసంత్ విహార్, డ్రీమ్ ఇండియా తదితర కాలనీల్లోకి వరదనీరు పోటెత్తడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు.

నీట మునిగిన పంటలు

ఝరాసంగం, హత్నూర, న్యాల్‌కల్, జహీరాబాద్, మునిపల్లి, రాయికోడ్, కంగ్టి, నారాయణఖేడ్ తదితర మండలాల్లో సాగు చేసిన పంట పొలాల్లో భారీగా వర్షం నీరు నిలిచింది. అత్యధికంగా పత్తి పంటతోపాటు చెరుకు పంటలు నీటమునిగాయి. నిమ్జ్ రహదారి పక్కనే ఉన్న పొలాల్లో పంటలు పూర్తిగా మునిగిపోయాయి.

3,596 ఎకరాల్లో పంట నష్టం

జిల్లాలో 3,596 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. జిల్లాలోని 10 మండలాల పరిధిలో 102 గ్రామాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. అత్యధికంగా పత్తి పంట 1,871 ఎకరాల్లో నష్టం వాటిల్లగా సోయాబీన్ 593, వరి 110, కంది 36, మొక్క జొన్న 67, పెసర 560, మినుము 321, జొన్న 18, ఉద్యాన పంటలు 38 ఎకరాల్లో జరిగినట్లు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.

నిలిచిన రాకపోకలు

జహీరాబాద్‌లోని బూచెనెల్లి-ఘనాపూర్, అల్గోల్-పొట్టిపల్లి, ఝరాసంగం మండల పరిధిలోని బొప్పన్‌పల్లి-ప్యారవరం, మేదపల్లి-ఈదులపల్లి, న్యాల్‌కల్‌లోని రేజింతల్-ఎల్గోయి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సంగారెడ్డి-కామారెడ్డి జిల్లాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఖేడ్- కంగ్టి ప్రధాన రహదారిపై రాకపోకలు స్తంభించాయి. నిజాంపేట్ మండలం శాఖాపూర్ పరిధిలోని భీముని చెరువు అలుగు పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కంగ్టి మండలంలోని రాసోల్, బాన్సువాడ, భీంరా, నాగుర్(కే), జమ్గి(బి), గాంధీనగర్, సాదుతండా, దామర్‌గిద్దా తదితర గ్రామాలకు రాకపోకలు లేకుండా పోయాయి.

అలుగుపారుతున్న వాగులు వంకలు

న్యాల్‌కల్ మండలంలో డప్పూర్ వాగు చాలాకాలం తర్వాత అలుగుపారుతోంది. హత్నూర మండల పరిధిలోని కొన్యాల కంచన్ చెరువు, హత్నూరలోని పెద్ద చెరువు, నడిం చెరువులు పూర్తిగా నిండి మత్తడి దూకుతున్నాయి. ఝరాసంగం మండల పరిధిలోని జీర్లపల్లి, బొప్పన్‌పల్లి, సదాశివపేటలోని గంగకత్వ చెరువులు పొంగిపొర్లుతున్నాయి. అందోల్ మండలంలోని అన్నాసాగర్, అందోల్, కన్‌సాన్‌పల్లి తదితర గ్రామాల్లో పెద్ద చెరువులు పొంగి అలుగుపారుతున్నాయి. కల్హేర్-పిట్లం మధ్యలో మహరాజ్ వాగు, మీర్ఖాంపేట్ వద్ద వాగు, ఫత్తేపూర్-పిట్లం మార్గంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

39 ఏళ్ల తర్వాత నిండిన ఖాదరు చెరువు

39 ఏళ్ల తర్వాత అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలోని ఖాదరు చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు దూకుతూ పక్కనే ఉన్న కొండరెడ్డికుంటలోకి వరద ప్రవహిస్తోంది.

నారింజకు భారీ వరద

వర్షాలకు నారింజ ప్రాజెక్టుకు భారీగా వరద రావడంతో నారింజ వాగు నిండుకుండలా ప్రవహిస్తోంది. ప్రాజెక్టులోకి 7,444 క్యూసెక్కుల మేర ఎగువ ప్రాంతం నుంచి వరద చేరుతోంది. ప్రాజెక్టులోని రెండు గేట్లను 6 అడుగుల మేర పైకెత్తి 7,298 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

రంగంలోకి రెస్క్యూ బృందాలు

పరిస్థితులను తిరిగి సాధారణస్థితికి తెచ్చేందుకు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. బాధితులకు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి.

గర్భిణిని ప్రత్యేక వాహనంలో తరలింపు

నిజాంపేట్ మండలం శాఖాపూర్ చెరువు పొంగి ప్రవహించడంతో శాఖాపూర్-నిజాంపేట్ గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. దీంతో శాఖాపూర్ గ్రామానికి చెందిన గంగి రేణుక(25) గర్భిణిని ప్రత్యేక వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో శిథిలావస్థకు చేరిన నివాసాలను జేసీబీతో కూల్చివేశారు.

వర్షపాతం నమోదు

జిల్లావ్యాప్తంగా గురువారం 5.3 సెంటీమీటర్లు బుధవారం 6.5సెం.మీల సగటు వర్షపాతం నమోదైంది. కాగా, నిజాంపేటలో 10.8సెం.మీ, పుల్‌కల్ 8.1సెం.మీ, ఝరాసంగం 8.1 సెం.మీ, వట్ పల్లి 7.3సెం.మీ, కంది, నాగల్‌గిద్దలో 7.1 సెం.మీ, మనూర్ 6.8సెం.మీలు నమోదు కాగా, అతి తక్కువగా జహీరాబాద్‌లో 2.0 సెం.మీల వర్షపాతం నమోదైంది.

దెబ్బతిన్న ఇళ్లు

హత్నూర మండలంలోని దౌల్తాబాద్‌లో దుర్గాబాయి ఇల్లు ఉదయం వెనుకభాగం కూలిపోగా, లక్ష్మమ్మ పూరి గుడిసె పూర్తిగా కుప్పకూలింది. గోవిందరాజుపల్లి గ్రామంలో ముద్దుల శ్రీశైలం ఇల్లు గోడ కూలిపోయింది. లక్మాతాండ, కాసాల గ్రామంలో రెండు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. జెడ్పీహైస్కూల్ భవనం గోడ కూలిపోయింది. వట్‌పల్లి మండలంలోని ఖాదిరాబాద్, నాగులపల్లి, నర్లప్ల తదితర గ్రామాల్లో ఇళ్లు వర్షానికి దెబ్బతిన్నాయి. కల్హేర్ మండలంలోని సిర్గాపూర్‌లో ఇళ్లలోకి నీరు చేరడంతో బాధితులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీశారు.


దౌల్తాబాద్‌లో కూలిన పాఠశాలగోడ


రాంసాన్‌పల్లి శివారులో పొలాల మీదుగా ప్రవహిస్తున్న పెద్దవాగు


ఖేడ్ మండలంలోని ఓ రోడ్డు పై చెట్లను తొలగిస్తున్న జేసీబీ

పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు


మహరాజ్ వాగువద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఉమాహారతి

జిల్లాలో సహాయకచర్యలను ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. వరద ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి పర్యటించి బాధితులకు అండగా ఉంటామని హామీనిచ్చారు. రాసోల్ గ్రామానికి వెళ్లే స్వాములవాగు వంతెన వద్ద నీటి ప్రవాహాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పరిశీలించారు. జహీరాబాద్ పట్టణంలోని వరద ముంపునకు గురైన కాలనీలను, నారింజ ప్రాజెక్టును ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు సందర్శించారు. కల్హేర్-పిట్లం మధ్యలో మహరాజ్ వాగు, మీర్ఖాన్‌పేట్ వద్ద ప్రవహిస్తున్న వాగును ఖేడ్ మండలం కాంజీపూర్, మాద్వార్ వంతెనలతో పాటు నిజాంపేట్ మండలం శాకాపూర్ చెరువు ఉధృతిని, జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్, సబ్‌కలెక్టర్ ఉమాహారతి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు.


ఖాదరు చెరువు పూర్తిగా నిండటంతో చూసేందుకు వచ్చిన గ్రామస్తులు


సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్పీ


బొప్పనపల్లి గ్రామ శివారులో పారుతున్న అలుగు

వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

కలెక్టర్ పి.ప్రావీణ్య

సంగారెడ్డి, సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లాలో కురిసిన వర్షాలపట్ల అన్ని శాఖలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి పట్టణ పరిధిలోని రేణిగుంట, ఎర్రగుంట, మాసానుకుంట చెరువులను కలెక్టర్ సందర్శించారు. రేణిగుంట చెరువులో ఏర్పడిన గండిని పరిశీలించిన కలెక్టర్ తక్షణ మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాగులు, చెరువులు, కుంటల వద్దకు ఎవరూ వెళ్లవద్దని హెచ్చరించారు. జిల్లాలో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సహాయం కోసం 08455-276155 నంబర్‌కు కాల్‌చేయవచ్చని చెప్పారు. ఇంటింటా జ్వర సర్వేలు నిర్వహించాలని ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే సత్వర చికిత్సలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ రవీందర్‌రెడ్డి, సంగారెడ్డి తహసీల్దార్ జయరామ్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


సంగారెడ్డి పట్టణంలో పర్యటిస్తున్న కలెక్టర్

మౌలిక సదుపాయాలపై శ్రద్ధ

పాఠశాలలో మౌలిక వసతుల సదుపాయాలలో భాగంగా విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు తదితర విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు.

నాటి పోరాట ఫలితమే ఉచిత విద్యుత్

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు


సంగారెడ్డి ఎడ్యుకేషన్: విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేపడతామని, నాటి విద్యుత్ పోరాట ఫలితంగానే రాష్ట్రంలో ఉచిత విద్యుత్ అమలవుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కారాములు పేర్కొన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్‌భవన్‌లో విద్యుత్ అమరవీరుల 25వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ పోరాట మృతవీరులు విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి, రామకృష్ణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చుక్కా రాములు మాట్లాడుతూ..2000లో ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అవలంబించిన ప్రజావ్యతిరేక విధానాలు, విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఉధృతమైన ఉద్యమాలు జరిగాయన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణకు, పెంచిన చార్జీలకు వ్యతిరేకంగా నిర్వహించిన ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో వేలాదిమంది ప్రజలు పాల్గొన్నారని గుర్తు చేశారు. పాలక ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి ఆగస్టు 28న బషీర్‌బాగ్ వద్ద ముగ్గురు అమరులను దుర్మార్గంగా కాల్చి చంపిందన్నారు. అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆ ప్రభుత్వాన్ని దారుణంగా ఓడించారని గుర్తు చేశారు. దీంతో నేటికీ ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు పెంచకుండా ప్రజలందరికీ ఉచిత విద్యుత్తును అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాణిక్యం, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, కృష్ణ, నాయకులు అశోక్, రాజయ్య, శివ కుమార్, బాలరాజు, ప్రవీణ్, విఠల్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.


అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

దిగువకు సింగూరు నీరు

40,113 క్యూసెక్కుల నీరు విడుదల

పుల్‌కల్(అందోల్): సింగూర్ ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. నాలుగు గేట్లను ఎత్తి దిగువకు 40,113 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రస్తుతం డ్యామ్‌లో 18 టీఎంసీల నీటిని ఉంచి మిగతా నీటిని దిగువకు వదులుతున్నారు.


సింగూరు డ్యామ్

ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి

జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్

సదాశివపేట(సంగారెడ్డి): వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ పేర్కొన్నారు. విగ్రహాల నిమజ్జనంలో ఎలాంటి అపశృతులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే ఉభ చెరువును పోలీసు, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి గురువారం సందర్శించి అక్కడ చేపట్టనున్న భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోశ్ పంకజ్ మాట్లాడుతూ..నిమజ్జనాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశిత సమయంలోనే నిమజ్జనం చేసేలా చూడాలని, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కురుస్తున్న వర్షాలకు ఉభచెరువు కట్ట రోడ్డుపై ఇతర రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, సీఐ వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్ శివాజీ, తహసీల్దార్ సరస్వతి, ఇంజీర్ రాజేష్ పాల్గొన్నారు.


ఉభచెరువును పరిశీలిస్తున్న ఎస్పీ పరితోశ్ పంకజ్

2న తుది ఓటరు జాబితా

- జీపీలలో ముసాయిదా జాబితా ప్రచురణ
- ఈనెల 30 వరకు అభ్యంతరాల స్వీకరణ

సంగారెడ్డి జోన్: పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు ప్రారంభించింది. ఈ మేరకు ఓటరు జాబితా తయారీపై మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌ను జారీ చేయగా వార్డుల వారీగా కొత్త ఓటరు జాబితాను తయారు చేశారు.

ముసాయిదా ఓటరు జాబితా

జిల్లాలోని గ్రామ పంచాయతీల వారీగా ఫొటోలతో కూడిన జాబితాను సిద్ధం చేసి వార్డుల వారీగా గురువారం ప్రచురించారు. 29న జిల్లాస్థాయిలో, 30న మండలస్థాయిలో మండల అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకులతో ఓటరు జాబితాపై సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ముసాయిదా జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే 28 నుంచి 30 వరకు సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చు. స్వీకరించిన అభ్యంతరాలు 31న పరిష్కరించనున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సిద్ధం చేసిన తుది ఓటరు జాబితాను వార్డులు పంచాయతీల వారీగా సెప్టెంబరు 2న విడుదల చేయనున్నారు.


గ్రామ పంచాయతీలో ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేస్తున్న అధికారులు

కొనసాగుతున్న ప్రత్యేక పాలన

2024 సంవత్సరం జనవరి నెలలో సర్పంచుల పదవీకాలం ముగిసింది. అనంతరం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. అప్పట్నుంచీ గ్రామాల్లో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. అందులోభాగంగా మండలంలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో పంచాయతీ పాలన కొనసాగిస్తున్నారు.

తగ్గిన గ్రామ పంచాయతీలు, వార్డులు

జిల్లాలో పలు మండలాలతోపాటు గ్రామ పంచాయతీలను కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలలో విలీనం చేయడంతో గతంలోకంటే జీపీలు, వార్డుల సంఖ్య తగ్గింది. త్వరలో మరిన్ని పంచాయతీలు తగ్గనున్నట్లు సమాచారం. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 25 మండలాల పరిధిలో 613 గ్రామపంచాయతీలున్నాయి. అందులో 5,370 వార్డులు ఉండగా 5,542 పోలింగ్ స్టేషన్లున్నాయి. జిల్లావ్యాప్తంగా 7,44,297 మంది ఓటర్లు ఉన్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు



"రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల వారీగా కొత్తగా ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నారు. నోటిఫికేషన్ విడుదల చేసిన ముఖ్యమైన తేదీల వారీగా సమావేశాలు నిర్వహించి, తుది ఓటరు జాబితా ప్రకటిస్తారు."
-సాయిబాబా, జిల్లా పంచాయతీ అధికారి, సంగారెడ్డి

న్యూస్‌రీల్

గణనాథుడి సన్నిధిలో యాదాద్రి కలెక్టర్


గణనాథుని సన్నిధిలో యాదాద్రి కలెక్టర్

పటాన్‌చెరు టౌన్: వినాయక చవితి పురస్కరించుకుని పటాన్‌చెరు మండలం పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలో గణేశ్‌గడ్డ దేవస్థానంలో గణేశుడిని బుధవారం యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు సిబ్బంది తీర్థ ప్రసాదాలను అందజేసి, కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సంతోశ్ జోషి,జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్ ,అయ్యప్ప ,సతీష్,ఆలయ ఈవో లావణ్య, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు టీజీఈజేసీ వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

సంగారెడ్డి: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీజీఈజేసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కలెక్టర్‌కు ఆ సంఘం నాయకులు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు జావెద్ అలీ మాట్లాడుతూ...పెన్షన్ విధానంలో వచ్చిన మార్పులు ఉద్యోగుల భవిష్యత్ భద్రతపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని, తక్షణమే సరైన నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. సెప్టెంబర్ 1న నిర్వహించతలపెట్టిన పెన్షన్ విద్రోహ దినం కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీజీ జేఏసీ కార్యదర్శి వైద్యనాథ్, కో చైర్మన్ గంగాధర్ టీఎన్జీవోస్ నాయకులు రవి పాల్గొన్నారు.

గండ్లను పూడ్చటంలో కాలయాపన

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

పుల్‌కల్(అందోల్): సింగూరు పంట కాలువలకు గండ్లు పడి పక్షం రోజులైనా పూడ్చకపోవడం పట్ల అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పాలకుల తీరును విమర్శించారు. పక్షం రోజుల క్రితం ఇసోజీపేట వద్ద, బస్వాపూర్ వద్ద సింగూరు పంట కాలువకు గండ్లు పడితే స్థానిక మంత్రి దామోదర రాజనర్సింహ అట్టహాసంగా ట్రాక్టర్‌పై వెళ్లి గండ్లను పరిశీలించారు. పరిశీలించిన గండ్లను పూడ్చకుండా కాలయాపన చేస్తే ఆయకట్టు రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గండ్లు పడటం వల్ల కాలువ లిఫ్టులను మూసివేశారని, ఆయకట్టుకు సింగూరు నీటిని నెల రోజులు తర్వాత వదలటంతో రైతులు ఆలస్యంగా నాట్లు వేశారని తెలిపారు. వర్షాలతో ప్రజలు అష్ట కష్టాలు పడుతుంటే మంత్రి దామోదర పట్టించుకోవడం లేదని విమర్శించారు.

ఉపకారవేతనాలు విడుదల చేయాలి

గణనాథుడికి వినతి పత్రం


వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపకారవేతనాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏబీవీపీ ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ ఆకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో వినాయకుడికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆకాష్ మాట్లాడుతూ..రాష్ట్రంలో పేద, మధ్యతరగతి విద్యార్థులకు చెల్లించవలసిన రూ.8,500 కోట్ల స్కాలర్షిప్‌లు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించే బుద్ధిని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రసాదించాలని వినాయకునికి ప్రార్థించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

లేఖారచనలో జాతీయస్థాయి విజేతగా రిబ్కా


రిబ్కా

సిద్దిపేటఎడ్యుకేషన్: 'యువత సామాజిక మాధ్యమాల ప్రభావం'అనే అంశంపై నిర్వహించిన జాతీయ స్థాయి లేఖారచన పోటీలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని తిప్పనబోయిన రిబ్కా విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా గురువారం ఆమెను కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యారెడ్డి తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా తెలుగుశాఖ, భాషాసాంస్కృతిక విభాగం అధ్యక్షుడు డాక్టర్ మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వ్యావహారిక భాషోద్యమకారుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెం డీఆర్జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ పోటీలు జరిగాయన్నారు. విద్యార్థిని రిబ్బ త్వరలో నగదు పురస్కారం, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకోనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తెలుగువిభాగం అధ్యాపకుడు పిట్లదాసు, వెంకటరమణ, శైలజ, సాయిసురేశ్, నరేశ్, రామస్వామి పాల్గొన్నారు.

శేరిపల్లి పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు


శేరిపల్లి ప్రాథమిక పాఠశాల

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని శేరిపల్లి ప్రాథమిక పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది. ఆ పాఠశాల హెచ్ఎం వెంకట్ రెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. 'తల్లి దండ్రులను సులభంగా పాల్గొనేలా చేయొచ్చు'అనే అంశంపై పాఠశాల ఉపాధ్యాయుడు బి.రవి రాసిన కథనాన్ని రాష్ట్ర విద్యాశాఖ ఎస్‌సీఈఆర్‌టీ ప్రచురించిన 'ట్రెయిల్ బ్లేజర్స్'అనే పుస్తకంలో ప్రచురించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తోటి ఉపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, షెహనా బేగంతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, దాతల సహకారం పాఠశాలలో నిర్వహించిన వినూత్న కార్యక్రమాలే పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు రావడానికి తోడ్పడ్డాయన్నారు.

ఇసుక లారీ సీజ్


సీజ్ చేసిన ఇసుక లారీతో పోలీసులు

చిన్నకోడూరు(సిద్దిపేట): అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక లారీని సీజ్ చేసినట్లు ఎస్ఐ సైఫ్ అలీ తెలిపారు. రాజీవ్ రహదారిపై చర్లఅంకిరెడ్డిపల్లి సమీపంలో గురువారం తెల్లవారుజామున పోలీసులు తనిఖీలు చేపట్టారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకుని డ్రైవర్ శ్రీనివాస్‌ను విచారించారు. కరీంనగర్ జిల్లాలోని మోయతుమ్మెద వాగు నుంచి ఇసుకను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తేలింది. దీంతో లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, ఇసుక లారీని సీజ్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆవులు మృతి

సదాశివపేటరూరల్(సంగారెడ్డి): విద్యుదాఘాతానికి గురై రెండు ఆవులు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలో ఆరూర్లో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పెద్దగొల్ల రాములు రోజులాగానే శివారులో ఆవులను మేతకు వదిలాడు. ఈ క్రమంలో అవి మేత మేస్తూ అక్కడ వేలాడుతున్న విద్యుత్ వైర్లను తాకాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందాయి. ఆవుల విలువ రూ.1.40 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు. విషయం తెలుసుకున్న వెటర్నరీ అధికారులు పంచనామా నిర్వహించారు.

పిచ్చికుక్క వీరవిహారం

ఐదుగురికి గాయాలు


గాయాన్ని చూపుతున్న ఎలీషా

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లిలో పిచ్చి కుక్క వీర విహారం చేసింది. ఐదుగురికి కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన సంతోష, ఎలీషా, కార్తీక్, దస్తగీర్, ప్రశాంత్‌లపై కుక్క దాడి చేసింది. గాయాలైన వీరిని వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే గ్రామంలో కుక్కల సంచారం పెరిగిందని, అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

మున్సిపల్ అధికారిపై శాఖాపరమైన చర్యలు

సిద్దిపేటజోన్: మున్సిపల్‌కు చెందిన అధికారిపై ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు చేపట్టారు. సిద్దిపేట మున్సిపాలిటీలో యూడీఆర్ఐగా పనిచేస్తున్న బాలకృష్ణ తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి పదోన్నతి పొందినట్టు విచారణలో తేలింది. ఈ మేరకు బాలకృష్ణను తిరిగి జూనియర్ అసిస్టెంట్‌గా డిమోషన్ చేసి తూప్రాన్ మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ వరంగల్ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ ఉత్తర్వులు జారీ చేశారు. విషయాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ధ్రువీకరించారు.

వాన హైరానా..


హవేళఘణాపూర్: రాజపేట వద్ద వరదకు కొట్టుకొచ్చిన ఆటో

మెదక్ జిల్లాను వర్షాలు ముంచెత్తాయి. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, కుంటలు ఉప్పొంగుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు ఇళ్లు నీట మునిగాయి. పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, రోడ్లు ధ్వంసమయ్యాయి. భారీగా ఆస్తినష్టం జరిగింది.


మెదక్ మున్సిపాలిటీ: గాంధీనగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రోహిత్


మెదక్ జోన్: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఎంసీహెచ్‌కు తరలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం


పాపన్నపేట: ఏడుపాయల ఆలయం ఎదుట ఉధృతంగా ప్రవహిస్తున్న వరద


మెదక్ జోన్: ధ్వంసమైన మెదక్-బోధన్ రహదారి


మెదక్ జోన్: హవేళిఘణాపూర్ మండలంలో వరద నీటిలో పొలం

తేనెలొలుకు తెలుగు... పరిమళించు పలుకు


కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు(ఫైల్)

- కవుల ఊహలకు కట్టిన భాష తెలుగు
- ప్రపంచంలో అధికులు మాట్లాడే భాషలో ఒకటి
- నేడు తెలుగుభాష దినోత్సవం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అమ్మ ఒడి నుంచి నేర్చిన మాటలు తేనె లొలుకు తెలుగు భాష. తెలుగు భాషలో ఎక్కడ మాట్లాడినా మన తెలుగోడికి మధురానుభతిని కల్గిస్తాయి. ఎల్లభాషలలో మాతృభాష పరిమళం నయనానందం. మనం ఎక్కడ ఉన్న మన భాష, మనం మాట్లాడే మాటల్లో వ్యక్తం అవుతుంది. తెలుగులో మాట్లాడే విధంగా ఇతర భాషలో మాత్రం అంత స్పష్టంగా మాట్లాడలేము. తెలుగు అనేది కేవలం భావ వ్యక్తీకరణ కోసం ఉపయోగించే భాష మాత్రమే కాదు, యుగయుగాలుగా కవుల ఊహలకు రెక్కలు కట్టి, మన పండితుల జ్ఞానానికి పదును పెట్టిన భాష. మన జాతి ప్రాచీన వారసత్వానికి ప్రాణం తెలుగు భాష. ప్రపంచంలో అధికులు మాట్లాడే భాషల్లో మన తెలుగుభాషకు ప్రత్యేక స్థానం ఉంది. మన తెలుగు వారు ఎక్కడ ఉన్న అక్కడ మన తెలుగు వర్ధిల్లుతుంది. అక్కడి భాష ఏదైనా మన తెలుగువారు కలుసుకున్నపుడు మాత్రం తెలుగులోనే మాట్లాడుతూ.. తెలుగును మరింత వ్యాప్తి చేయడం సంతోషించదగిన విషయం. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా జిల్లాలో తెలుగు భాష అభివృద్ధికి కృషి చేస్తున్న సంస్థలు, సంఘాలు, వ్యక్తులపై సాక్షి పాఠకులకు అందిస్తున్న ప్రత్యేక కథనం. తేనేలేను తెలుగు లోగిళ్లలో వికాస తరంగం. నిత్యం సాహిత్య పూదోటగా వికాసానికి తోడ్పడుతున్న మాగాణి. సాహిత్య సంపదకు నిలయమైన సిద్దిపేట జిల్లాలో అనేక సంఘాలు, సాహితీ సంస్థలు ముందుంటాయి. ముఖ్యంగా మంజీరా రచయితల సంఘం, తెలంగాణ రచయితల సంఘం, వెన్నెల సాహిత్య సంఘం, తెలంగాణ రచయితల వేదిక, సిద్దిపేట రచయితల సంఘం తదితర సంఘాలు, సంస్థలు తమ వంతు కృషి చేస్తున్నాయి. ఈ సంస్థలు కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు, సమావేశాలు, సాహిత్య గోష్ఠిలతో తెలుగు వెలుగులు నింపుతున్నాయి. శతాధిక కవులున్న సిద్దిపేటలో కవిత, పద్యం, కథ, మణిపూసలు, గేయాలు, వ్యాసాలు తదితర ప్రక్రియలలో తమదైన శైలిలో రచనలు చేయడంతో పాటుగా, పుస్తకాలు ముద్రిస్తూ రాష్ట్రంలోనే ప్రత్యేకతను సంతరించుకున్నారు. స్పష్టమైన తెలుగులో అక్షరబద్ధమైన రచనలతో చైతన్యం నింపుతూ తాము రచనలు చేయడంతో పాటుగా బాలలచే రచనలు చేయిస్తున్నారు. బాలకవులను తయారు చేస్తున్నారు. తెలుగుభాష పరిమళం సిద్దిపేట ఒడిలో ఓలలాడుతూ పలు భాషల ప్రక్రియల పట్ల అవగాహన తెచ్చేందుకు కృషి చేస్తున్న రచయితల స్ఫూర్తి అభినందనీయం. ఇలాగే సాహితీ క్షేత్రంగా సిద్దిపేట భావితరాలకు తెలుగుభాష మాధుర్యాన్ని పంచుతూ ముందుకు సాగుతుంది.

తెలుగుభాషపై ఉన్న పట్టు ఇతర భాషలపై ఉండదు



ఎన్ని భాషలు నేర్చుకున్న మన తెలుగు భాష మీద ఉన్న ప్రావీణ్యం ఎందులో ఉండదు. తెలుగుభాషపై ఉన్న పట్టు ఇతర భాషలపై ఉండదు. రాష్ట్రంలోనే సిద్దిపేటకు ప్రత్యేక స్థానం ఉంది. అన్ని రంగాల్లో ముందు ఉన్న సిద్దిపేట తెలుగుభాష అభివృద్ధిలోను ముందుంటుంది. జిల్లాలో అనేక సంఘాలు, సంస్థలు ఈ తెలుగుభాష అభివృద్ధికి కృషి చేస్తున్నాయి.

-కథల తాతయ్య ఎన్నవెళ్లి రాజమౌళి, ప్రముఖ కవి, సిద్దిపేట

తెలుగు భాషను మించినది లేదు



కన్నతల్లి ప్రేమ, పుట్టి పెరిగిన ఊరు, తెలుగుభాషపై మమకారం తీరనిది. ఎన్ని భాషలు వచ్చిన, ఎన్ని ప్రాంతాలకు వెళ్లిన మన ప్రాంతం, మన తెలుగు భాషపై పట్టు ఉంటుంది. చిన్న పిల్లలు కూడా తమ అభిప్రాయాలను కేవలం తెలుగుభాషలో మాత్రమే వ్యక్తం చేస్తారు. జిల్లాలో తెలుగు సభలు, సమావేశాలు, కవి సమ్మేళనాలతో నిత్యం తెలుగుభాష పరిరక్షణకు అందరం తోడ్పాడుతున్నాం.

-ఉండ్రాళ్ల రాజేశం, బాలసాహితీవేత్త, సిద్దిపేట

కబ్జా చేస్తే ఇలాగే ఉంటుంది


నార్సింగి జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

- ప్రకృతి ప్రకోపాన్ని చవిచూడాల్సి వస్తుంది
- ఎంపీ రఘునందన్‌రావు హెచ్చరిక
- వరద ప్రభావిత ప్రాంతాల సందర్శన

రామాయంపేట/నిజాంపేట(మెదక్)/ చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ జిల్లా రామాయంపేట, సిద్దిపేట జాతీయ రహదారిపై నందిగామ వద్ద కొత్త వంతెన నిర్మాణం కోసం కృషి చేస్తామని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. గురువారం రామాయంపేట, నిజాంపేటలో వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. అనంతరం గురుకులంలో షెల్టర్ పొందుతున్న డిగ్రీ విద్యార్థినులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. చెరువులు, కుంటలను కబ్జా చేస్తే పరిస్థితి ఇలాగే ఉంటుందని చెప్పారు. ఇకనైనా కబ్జాలను మానుకోకపోతే ప్రకృతి ప్రకోపాన్ని చవి చూడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు యువత ముందుండి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీ సూచించారు.

జాతీయ రహదారి మరమ్మతులు చేపట్టాలి

జాతీయ రహదారిని వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీ రఘునందన్‌రావు కోరారు. గురువారం నార్సింగి జాతీయ రహదారిని పరిశీలించారు. జాతీయ రహదారి అధికారులతో మాట్లాడారు. వరద ఉధృతితో ఇసుక మేటలు వేసిన పంట పొలాలను పరిశీలించారు. జాతీయ రహదారిపై వరద రాకకు కారణం అన్వేషించి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రమాదాల నివారణకు పోలీస్, రెవెన్యూ యంత్రాంగం, బీజేపీ కార్యకర్తలు స్పందించడంపై అభినందించారు.

విద్యుత్‌ను పునరుద్ధరించండి

హవేళిఘణాపూర్(మెదక్): వరద ముప్పు తప్పిందని, తమ తండాకు విద్యుత్ పునరుద్ధరించేలా చూడాలని మండల పరిధిలోని దూప్‌సింగ్ తండా వాసులు ఎంపీ రఘునందన్‌రావుతో ఫోన్‌లో మొర పెట్టుకున్నారు. రాజ్‌పేట వంతెన సందర్శించిన అనంతరం అక్కడి నుంచి తండావాసులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. వరద ముప్పు ఏమీ లేదని, కరెంటు సరఫరా లేకపోవడంతో తాగునీటి, ఇతర అవసరాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఇందుకు ఎంపీ బదులిస్తూ.. ప్రస్తుతం స్తంభాలు కూలిపోయి కరెంటు సరఫరా లేనందున ప్రత్యామ్నాయంగా కామారెడ్డి జిల్లా నుంచి విద్యుత్ సరఫరా చేసే విధంగా చూస్తామని హామీనిచ్చారు. ఎంపీ వెంట బీజేపీ జిల్లా నాయకులు శ్రీపాల్, ఎంఎల్ఎస్ రెడ్డి ఉన్నారు.

కనీస వేతనం రూ 26వేలు ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లాలోని పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో ఈ నెల 29న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు.

వేర్వేరు చోట్ల నలుగురు అదృశ్యం

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల నలుగురు అదృశ్యమయ్యారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భార్యకూతురు..


సంగీత


నమనీ

పటాన్‌చెరు టౌన్: భార్య,కూతురు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగికి చెందిన రమేష్ చెత్త బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే రమేష్ భార్య సంగీతకు ఇటీవల ఆపరేషన్ కావడంతో గుల్బర్గాలో ఉండే తల్లిగారి ఇంటికి కూతురు నమనీ(2)ని తీసుకొని వెళ్లింది. తిరిగి ఈనెల 20న తిరిగి ముత్తంగి ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో ఈనెల 24న రమేష్ పనికి వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి భార్య సంగీత, కూతురు నమనీ కనిపించలేదు. రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భర్త...


రాజేశం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్‌కు చెందిన రాగి రాజేశం(45) అదృశ్యమైనట్లు ఎస్ఐ సౌజన్య తెలిపారు. ఈ నెల 27న తెల్లవారుజామున ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో రాజేశం కుమారుడు అజయ్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సౌజన్య తెలిపారు. కాగా, రాజేశం మద్యం తాగే విషయంలో భార్యతో ఘర్షణ చోటుచేసుకుందని, ఇంట్లో నుంచి వెళ్లే సమయంలో పసుపు చొక్కా వేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వ్యక్తి...


సాయిలు

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలం పరిధి రామేశ్వరంబండకు చెందిన సాయిలు ఈ నెల 26న భార్య స్వప్నతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లిన తిరిగి రాలేదు. దీంతో భర్త కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. కేసు దర్యాప్తులో ఉంది.

మట్టి గణపతికే జై

- పల్లెల్లో ఎకో ఫ్రెండ్లీ గణేశుడు
- పర్యావరణహితంగా చవితి వేడుకలు


వెంకటాపూర్ గ్రామంలోని ముత్యాల పోచమ్మ ఆలయం వద్ద ప్రతిష్ఠించిన ఎకో ఫ్రెండ్లీ గణేశుడు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మట్టి విగ్రహాలకు ఆదరణ పెరుగుతోంది. ఏకో ఫ్రెండ్లీ గణేశుడికే యువత జై కొడుతోంది. ఈ ఏడాది పర్యావరణ హితంగా ఊరూరా చవితి వేడుకలు జరగడం విశేషం. పర్యావరణహితంగా వినాయక చవితి జరుపుకోవాలని పర్యావరణవేత్తలతోపాటు ప్రజా ప్రతినిధులు, నాయకులు యువతను ప్రోత్సహించడంతో పలువురు మట్టి వినాయకులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండలంలోని వెంకటాపూర్, పెద్దాపూర్, నందికంది, ఆరూర్ తో పాటుగా పలు గ్రామాల్లో ఈ ఏడాది యువత మట్టి విగ్రహాలనే పూజిస్తున్నారు. పర్యావరణానికి హాని కలిగించని రీతిలో మండపాలను ఏర్పాటు చేశారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన వినాయకుడిని పూజ అయ్యాక విగ్రహాన్ని నదిలో వదిలేయడమో, చెరువులో నిమజ్జనమో చేస్తారు. కానీ మట్టి వినాయకుడిని అలా చేయకుండా ప్రతిష్ఠించిన స్థలంలోనే నిమజ్జనం చేసి మట్టిని భక్తులకు పంచనున్నారు. భక్తులు అందులో ఒక విత్తనం పెట్టి, ఒక మొక్క పెట్టి ఇంటి ముందు నాటేందుకు చర్యలు చేపట్టారు. గ్రామాల్లో మట్టి గణేషుడే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ విశిష్ట పూజలు అందుకుంటున్నాడు. ఏది ఏమైనా మార్పు శుభపరిణామంగా చెపుకోవచ్చు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి

చికిత్స పొందుతూ మహిళ ..

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ మహిళా మృతి చెందింది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. డివిజన్ పరిధిలోని బస్టాండ్ సమీపంలోని గుర్తుతెలియని మహిళా పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమెను పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, మృతురాలికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి..

జహీరాబాద్ టౌన్: మండలంలోని హుగ్గెల్లి గ్రామ పరిధిలో రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తి శవాన్ని కనుగొన్నట్లు జహీరాబాద్ రూరల్ ఎస్ఐ. కాశీనాథ్ తెలిపారు. హుగ్గెల్లి పరిధిలో ప్యారడైజ్ హోటల్‌కు కొద్ది దూరంలో రహదారిపై సుమారు 56 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందని చెప్పారు. తీవ్రగాయాలు కావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడని, శవాన్ని జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

కార్మికుడి ..

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామికవాడలో కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన జిన్నారంలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి కథనం ప్రకారం బిజ్జి చంద్రశేఖర్(50) ఎంఎస్ఎన్ పరిశ్రమలో యుటిలిటీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. 27న పరిశ్రమలో ఓ భవనం నుంచి మరో భవనానికి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. అది గమనించిన యజమాన్యం వెంటనే బాచుపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే చంద్రశేఖర్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పిల్లలను పోషించలేక..

- చెరువులో దూకి మహిళ ఆత్మహత్య
- పండగ పూట విషాదం


రజిత

మనోహరాబాద్(తూప్రాన్): చనిపోయిన భర్త జ్ఞాపకాలు మరవలేక, ఇటు పిల్లలను సాకలేక మనస్తాపం చెందిన ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం ప్రకారం.. మండలంలోని రంగాయపల్లికి చెందిన జంగం రజిత(33) భర్త నాగేష్ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మొదటి భార్యకు కూతురు కూడా వీరి దగ్గరే ఉంటుంది. ముగ్గురు పిల్లలతో కలసి సాఫీగా సాగుతున్న వీరి సంసారంలో ఒక్కసారిగా పిడుగులాంటి వార్త కుదుపేసింది. రెండేళ్ల క్రితం భర్త గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి పిల్లలను పోషించలేక, ఆర్థిక సమస్యలు భరించలేక బుధవారం వినాయక చవితి రోజు ఇంట్లోంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో మామ జంగం నర్సింలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం చెరువులో శవమై తేలింది. మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల తీర్చలేక వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: అప్పుల బాధలు భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి సాయిప్రియ కాలనీకి చెందిన గుర్రం జాకబ్ (43) పటాన్‌చెరు మండలం రుద్రారంలోని తోషిబా పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఇటీవల బంధువుల దగ్గర అప్పులు తీసుకున్నాడు. 15 రోజులుగా పనికి వెళ్లకుండా ఆవేదన చెందుతున్నాడు. ఈ క్రమంలోనే ఈనెల 26న ఇంటి నుంచి బయటకు వెళ్లి అల్లుడు విక్రంకు లోకేషన్ పంపాడు. కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయం అక్కడికి వెళ్లగా ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.